సిఐ మధు నివాసం వద్ద నిరసన తెలుపుతున్న కందికుంట వెంకటప్రసాద్, టిడిపి నాయకులు

టిడిపి నాయకులపై తొడగొట్టి మీసం మెలేస్తున్న సిఐ మధు

అట్టుడికిన కదిరి

కదిరి పట్టణం నిరసనలతో అట్టుడికింది. ఖాద్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయం వద్ద షాపుల తొలగింపు అంశంలో మొదలైన ఘర్షణ చిలిచిలికి గాలివానలా మారింది. సిఐ కౌన్సిలర్ మధ్య మొదలైన ఘర్షణ రాత్రికి టిడిపి, వైసిపి మధ్య ఘర్షణగా మారింది. ఏకంగా కదిరి సిఐ మధు మీసం మెలసి తొడగొట్టి ఛాలెంజ్ చేసే వరకు వెళ్లింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ వివాదంతో ఎప్పుడు ఏమి జరిగుతుందో అన్న టెన్షన్ ప్రజల్లో నెలకొంది.

- వివాదంగా మారిన షాపుల తొలగింపు
- ఘర్షణకు ఆజ్యం పోసిన సిఐ వాఖ్యలు
- మీసం మెలేసి... తొడగొట్టిన సిఐ
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట నిరసన
- టిడిపి, వైసిపి ఘర్షణగా మారిన వైనం

ఘర్షణలో గాయపడిన టిడిపి కార్యకర్తలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వీధిలో దుకాణాలను తొలగించే నిమిత్తం శనివారం ఉదయం సిఐ తుమ్మశెట్టి మధు, ఆ వార్డు టిడిపి కౌన్సిలర్ సుధారాణి మధ్య చిన్నపాటి ఘర్షణ మొదలైంది. సిఐ కౌన్సిలర్‌ను అసభ్య పదజాలంతో దూషించడంతో వివాదం అధికం అయ్యింది. దీనికి తోడు సిఐ టిడిపి నాయకలపై మీసం మేలేయడం.. తొడగొట్టి మరింతగా రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడమే కాకుండా మహిళలు అని చూడకుండా బూతుపురాణం అందుకోవడం అందరినీ విస్మయానికి గురిచేసింది. దీనికి అధికార వైసిపి నాయకులు మరింత మద్దతు తెలపడమే కాకుండా ఆయన్ను భూజలపైకి ఎత్తుకుని ఊరేగించారు. అటు టిడిపి, ఇటు వైసిపి రెండు పార్టీలకు చెందిన వారు నిరసనలు చేపట్టడంతో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. శనివారం రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

షాపుల తొలగింపుతో మొదలైన వివాదం..

కదిరి పట్టణంలోనున్న ప్రముఖ దేవాలయం లక్ష్మినరసింహ స్వామి ఉత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆ వీధిలో రేకులషెడ్డులతో వేసుకున్న దుకాణాలున్నాయి. వీటిని తొలగించేందుకు పోలీసులు శనివారం ఆ ప్రాంతానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడి టిడిపి కౌన్సిలరుగానున్న సుధారాణి పోలీసులను వారించారు. దుకాణాలు తొలగించవద్దని కోరారు. కాని సిఐ తుమ్మిశెట్టి మధు ఆమెపై బూతుపురాణం అందుకున్నారు. ఈ విషయం తెలిసి మరికొంత మంది మహిళలు అక్కడికి చేరుకోవడం పోలీసులు, టిడిపి నాయకుల మధ్య వివాదం మొదలైంది. అనంతరం పోలీసు స్టేషన్ ఎదుట మహిళలను దుర్భాషలాడిన సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి మహిళా నాయకులు ధర్నాకు దిగారు. ఆ సమయంలోనూ మరోమారు సిఐ మధు రెచ్చిపోయారు. నిరసన తెలుపుతున్న మహిళలపై లాఠీఛార్జి చేశారు.

కందికుంట ఆందోళన

సిఐ మహిళల పట్ల అనుచితంగా ప్రవరించి వారిని ఇష్టానురీతిగా బూతులు తిట్టిన విషయం తెలుసుకున్న కదిరి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలోని సిఐ నివాసం వద్ద ఆందోళనకు దిగారు. ఆయన వెంట పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. ఈ సమయంలో కందికుంటపై కూడా సిఐ మధు అదే రకంగా వ్యవహరించారు. మీసాలు మేలేసి, తొడగొట్టారు. ఈ వివాదం నడుస్తున్న క్రమంలో వైసిపి నాయకులు అక్కడికి చేరుకుని సిఐకి మద్దతుగా నిరసన చేపట్టారు. ఆయన్ను భూజాలపై ఎత్తుకుని ఉరేగించారు. అటు టిడిపి, ఇటు వైసిపి ఇద్దరూ ఒకేసారి నిరసనలకు దిగడంతో పరిస్థితి చేదాటిపోయే వరకు వెళ్లింది. రెండు గ్రూపులు పరస్పరం రాళ్లు, చెప్పులు విసురుకున్నారు. ఈ ఘటనలో రెండువైపుల వారికి స్వల్ప గాయాలయ్యాయి. పరిస్థితి తీవ్ర రూపం దాల్చడంతో నల్లమాడ సిఐ అక్కడికి చేరుకుని రెండు గ్రూపులకు నచ్చజెప్పి పిరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

రహదారిపై టిడిపి శ్రేణుల నిరసన

టిడిపి శ్రేణులు కందికుంట ఆధ్వర్యంలో సిఐ తీరు నిరసిస్తూ కదిరి-అనంతపురం చెన్నై రహదారిపై సిఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఇక్కడికి కూడా సిఐ, వైసిపి శ్రేణులు మరోమారు అక్కడికి చేరుకున్నారు. దీంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారింది. వైసిపి శ్రేణులు మరోమారు సిఐని భుజాల మీద ఎక్కించుకుని, మీసం మేలేశారు. 'తేల్చుకుందాం రా'.. అంటూ టిడిపి శ్రేణులకు సవాల్ విసిరారు. ఇదే సమయంలో టిడిపి, వైసిపి శ్రేణులు ఒకరిపై ఒకరు విసురుకున్నారు. వెంటనే పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. మరోమారు నల్లమాడ సిఐ నిరంజన్ రెడ్డి కందికుంటకు సర్ధిచెప్పి అక్కడి నుంచి పంపారు.

పోలీసు స్టేషన్‌లో కందికుంట

రహదారిపై ఆందోళన చేస్తున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. రాత్రి 11 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. ఈ సమయంలోనూ స్టేషన్ బయట టిడిపి శ్రేణులు ఆందోళన నిర్వహించారు.

ఇష్టంగా చదివితే గమ్యం చేరడం సులభం

న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి కె.స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు ఆశయ సాధన కోసం కష్టపడి కాకుండా ఇష్టంగా చదివితే గమ్యాన్ని చేరడం సులభతరం అవుతుందని జూనియర్ సివిల్ జడ్జి కె.స్పందన సూచించారు. శనివారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా కీలకమైందన్నారు. ముఖ్యంగా దురలవాట్లకు దూరంగా ఉంటూ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సంస్కారవంతమైన ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రతి విషయాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో భాగాస్వామ్యం చేసుకోవాలన్నారు. ఉన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో స్థిరపడిన తర్వాత సమాజాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, అకడమిక్ డైరెక్టర్లు స్మిత, నందిత, హెచ్‌ఎం గాయత్రి, ఎట భాస్కర్, ఎహెచ్‌ఎంలు విజయేంద్ర, శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, న్యాయవాది ఫణికుమార్, లోక్ అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలి

బత్తలపల్లి : చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిప్పయ్య సూచించారు. శనివారం మండలంలోని చెన్నరాయపట్నం, సంగాల గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వ్యాధిగ్రస్తులు, గర్భవతులు, చిన్నారుల కుటుంబాలను కలిసి వివరాలను ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రాణాతంక వ్యాధుల నుంచి కాపాడటానికి వ్యాధి నిరోధక టీకాల్ని అందివ్వాలని, ఇందులో నిర్లక్ష్యానికి తావులేదన్నారు. గర్భవతులకు పలు ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు తేజశ్రీ, పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఎఎన్‌ఎంలు వాణి, ప్రభావతి, శ్రావణి, ఆశావర్కర్లు ఆదిలక్ష్మి, సరస్వతి, తదితరులు ఉన్నారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు : జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

సబ్‌జైలును తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు రావద్దని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా జైలులో ఉన్న ఖైదీల వివరాలు, ఏఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారనే విషయాలపై ఆరాతీశారు. అనంతరం జైలులో ఖైదీల కోసం తయారు చేసే ఆహార పదార్థాల కోసం ఉపయోగించే నిత్యావసరాలు పరిశీలించారు. తర్వాత నీటి నాణ్యత, జైలు గదులు, వైద్య సదుపాయాలను జైలర్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తప్పుల మీద తప్పులు చేసి జైలుకు రావడం వల్ల కుటుంబాలు ఎన్నో అవమానాలకు గురికావాల్సి వస్తుందన్నారు. కావున ప్రవర్తన మార్చుకుని ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కష్ణమూర్తి, రకీబ్, లోక్ అదాలత్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

మాట్లాడుతున్న శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా

విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు సాధ్యమని శ్రీసాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా సూచించారు. శనివారం స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రణాళికతో చదవాలన్నారు. కష్టపడికాకుండా ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మీపై ఎంతో నమ్మకంతో కళాశాలలకు పంపుతున్నారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా ఉత్తీర్ణత సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రసిడెంట్ పోలా ప్రభాకర్, డైరెక్టర్లు బండ్లపల్లి రంగనాథ్, డాక్టర్ సుబ్బారావు, రమణ, ఎస్‌ఎం అక్రం, ప్రిన్సిపాల్ ఫణికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విగ్రహాల రాజకీయం..!

'పురం'లో టెన్షన్..టెన్షన్.. పోలీసుల కవాతు..

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కొన్ని నెలలుగా హిందూపురం పట్టణం చుట్టూ విగ్రహాల రాజకీయం నడుస్తోంది. దీంతో హిందూపురంలో ఏక్షణంలో ఏం జరుగుతుందో అన్న టెన్షన్ వాతావరణం నెలకొంది. గత ప్రభుత్వం హయాంలో కనకదాస విగ్రహం ఏర్పాటు నుంచి మొన్న జరిగిన శ్రీ కృష్ణదేవరాయ విగ్రహం వరకు ఏఒక్క విగ్రహానికీ అనుమతి లేదు. అయితే అప్పట్లో విగ్రహాల ఏర్పాటు సమయంలో ప్రస్తుతం చేస్తున్న భారీ ప్రచారాలు లేవు. అయితే ఆదివారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కొన్ని రోజులుగా ఒక పార్టీకి చెందిన వారు కరపత్రాలు ముద్రించి పట్టణం నుంచి గ్రామస్థాయి వరకూ పంచుతూ పెద్దఎత్తున తరలిరావాలని ప్రచారాలు నిర్వహించారు. దీనికితోడు విగ్రహ ఏర్పాటుకు అనుమతులు తీసుకోకపోవడమే కాకుండా, ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఈనేపథ్యంలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి, మున్సిపల్ కమిషనర్, ఇన్‌ఛార్జి, తహశీల్దార్ కలిసి శుక్రవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రధాన రహదారుల్లో విగ్రహాల ఏర్పాటు అనుమతులు లేవని ప్రకటించారు. అయినప్పటికీ విగ్రహ ఏర్పాటు చర్యలు ఆపకుండా భూమిపూజకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఇన్‌ఛార్జి డిఎస్‌పి యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హిందూపురం సబ్ డివిజన్ వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బలగాలతో భారీ కవాతు నిర్వహించారు. వన్‌టౌన్ స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు ప్రధాన రహదారులు, మెయిన్ బజారు మీదుగా సమస్యాత్మక ప్రాంతాల్లో సాగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డిఎస్‌పి యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు కవాతు నిర్వహించామన్నారు. ఈ కవాతులో సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు ఈరన్న, వెంకటేసులు, కృష్ణారెడ్డితో పాటు ఎస్ఐ, ఎఎస్ఐలు, కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలు చేసే అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్టు

రూ.2.01 లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి-ప్రజాశక్తి ధర్మవరం టౌన్

అంతర్రాష్ట్ర దొంగల వివరాలను వెల్లడిస్తున్న రైల్వే జీఆర్పీ సిఐ బాలాజీనాయక్

రైళ్లలో ప్రయాణికులకు మత్తుమందు కలిపిన తిండి పదార్థాలు, నీళ్లు ఇచ్చి చోరీలకు పాల్పడే అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు రైల్వే జీఆర్పీ సిఐ నాగరాజు, హిందూపురం రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్, ధర్మవరం జీఆర్పీ ఎస్ఐ గోపీకుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైళ్లలో ప్రయాణికులకు మత్తుమందు పదార్థాలు ఇచ్చి దొంగతనాలు చేసే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్‌సింగ్, సోనుశుక్ల, రాజమణిని ధర్మవరం రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేసి రూ.2.01లక్షల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రైళ్లలో ఎలాంటి నేరాలు జరగకుండా గస్తీ పెంచుతామన్నారు. అంతేగాకుండా ఉన్నతాధికారుల సహకారంతో సీసీ కెమెరాల పెంపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

'పురం'లో జోరందుకున్న రోడ్డు విస్తరణ పనులు

హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు

ప్రజాశక్తి-హిందూపురం

రోడ్డుకు అడ్డంగా ఉన్నా భవనాలను తొలగిస్తున్న దృశ్యం

పట్టణానికి తలమానికంగా ఉన్న రైల్వే రోడ్డు విస్తరణ పనులతోపాటు ధనలక్ష్మి రోడ్డు విస్తరణ పనులు, రోడ్డుకు ఇరువైపుల మురుగు కాలువ నిర్మాణ పనులు జోరందుకున్నాయి. ఇందులో భాగంగా శనివారం రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు జెసిబి, కార్మికుల సహాయంతో తొలగించారు. ఆయా పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే రోడ్డుకు ఇరువైపులా 163 దుకాణాలు, ఇళ్లు ఉన్నట్లు ప్రయివేటు ఏజెన్సీ సర్వే నివేదిక ఇచ్చిందన్నారు. సంబధిత యజమానులతో పలు దఫాలు చర్చలు చేసి ఒప్పించామన్నారు. ఇప్పటి వరకు 80 శాతం మంది తమ అంగీకారం పత్రాలను అధికారులకు అందజేశారు. కట్టడాల తొలగింపు కోసం 117 మందికి పరిహారాన్ని కూడా అందజేసినట్లు తెలిపారు. కాగా కోల్పోయిన స్థలాన్ని గుర్తించి దాని మార్కెట్ విలువ కంటే నాలుగు రెట్లు అధికంగా ఇస్తూ టిడిఆర్ బాండ్లను జారీ చేశామన్నారు. 36 మంది విస్తరణ పనులను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించామన్నారు. అయితే అన్నివిధాలా పరిశీలన చేసిన న్యాయస్థానం డ్యూ ప్రాసెస్ కింద చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

పీపీ యూనిట్ వైద్యాధికారి జయం పద్మజ

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పీపీ యూనిట్ వైద్యురాలు పద్మజ

పురపాలక సంఘవ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న చిన్నారులకు క్రమం తప్పకుండా సకాలంలో టీకాలు అందించాలని పీపీ యూనిట్ వైద్యాధికారి జయం పద్మజ సూచించారు. శనివారం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి వ్యాక్సినేటర్స్‌కు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాసూచి, కలరా, పోలియో లాంటి రోగాలను టీకాల ద్వారానే అరికట్టాడానికి సాధ్యం అవుతుందన్నారు. సకాలంలో టీకాలు ఇవ్వకుంటే ప్రాణానష్టాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకే టీకాల నిర్వహణ ఆరోగ్యకర సమాజానికి నాంది అన్నారు. సమాజహితానికి నిర్వహించే ప్రతి కార్యక్రమం దేశసేవలో భాగంగానే భావిస్తూ ప్రతి చిన్నారికీ క్రమం తప్పకుండా అన్ని టీకాలు అందించాలన్నారు. టీకా వేసే రోజు తల్లితండ్రులకు ఏఏ వ్యాక్సిన్ ఏయే వ్యాధులకు వర్తిస్తుందనే విషయాలలో వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి మెనూ ప్రకారం ఆహారం పంపిణీ చేయాలన్నారు. అనంతరం లక్ష్మీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాక్సిన్ కోల్డ్ చైన్ నిర్వహణ, మందుల వివరాలు, ల్యాబ్ నిర్వహణ, గర్భవతుల నమోదు, యుక్తవయసు ఆడపిల్లల హిమోగ్లోబిన్, హెచ్‌బి టెస్టుల నిర్వహణ తదితర విషయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీపీ యూనిట్ సిబ్బంది సరస్వతి, ముస్తఫా, చంద్రశేఖర్, రమేష్, గౌసియ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిధి దాటుతున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అధికారులు తమ అధికార పరిధులను దాటి వ్యవహరించడం ఇటీవలి కాలంలో పెరుగుతోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ వారంలో జరిగిన రెండు ప్రధాన ఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఎన్నికల్లో పాలక పార్టీకి మద్దతుగా ఎన్నికల నిబంధనలను సైతం లెక్క చేయకుండా చేసిన వ్యవహారం పాలక భక్తిని చాటి చెబుతోంది. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి రాజ్యాంగ స్ఫూర్తికే భిన్నంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోనే దైవ భక్తి కార్యక్రమం పేరుతో మృత్యుంజయ హెూం నిర్వహించ తలబెట్టిన విషయం విధితమే . ఈ రెండు ఘటనలు కూడా అధికారులు తమ పరిధిలను ఏ రకంగా దాటి వ్యవహరిస్తున్నారన్నది స్పష్టం చేస్తోంది. విద్యాశాఖ ఉన్నతాధికారిగానున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి వైసిపి అభ్యర్థిగా ఉపాధ్యాయ నియోజకవర్గానికి బరిలో దిగిన రామచంద్రారెడ్డిని వెంట బెట్టుకుని ఒక అతిథి గృహంలో రాత్రి సమయంలో జరిపిన విందు వ్యవహారాన్ని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఆర్జేడీ మద్యం మత్తులో పోలీసు అధికారుల పట్ల కూడా దురుసుగా వ్యవహరించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అధికార పార్టీకి మద్దతుగా సదరు అధికారి వ్యవహరించి ఉండకపోతే ఈ పాటికే ఆ అధికారిపై కేసులు సైతం నమోదయి ఉండేవి. కాని అధికారపార్టీకి మద్దతుగా కావడం సదరు అధికారిపై ఎటువంటి చర్యలేవన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఇక శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధికారికంగా ఒక హెూమాన్ని నిర్వహించడం ఒక రకంగా దేశ వ్యాప్తంగానే చర్చనీయాంశమైంది. దీనిపై వెనక్కు తగ్గేదేలేదని ముందు బుకాయించిన అధికారులు తరువాత మాట మార్చి హెూమాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించక తప్పలేదు. పై రెండు ఘటనల్లోనూ విద్యార్థి, యుజవన సంఘాల పోరాట పాత్రయే ప్రధానం కావడం గమనార్హం.ఇక ఈ వారంలో మండలి ఎన్నికల వేడే సైతం మొదలైంది. నామినేషన్ల ఘట్టం ఒక రకంగా సజావుగానే సాగిందని చెప్పాలి. పట్టభద్రుల, ఉపాధ్యాయ, స్థానిక సంస్థలు మూడింటికి ఒకేసారి నామినేసన్లు స్వీకరణ జరిగింది. దీంతో రాజకీయంగానూ హడావుడి కొనసాగింది. అన్ని ప్రధాన పార్టీలు ఎన్నికల వైపు దృష్టి సారించాయి. ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి రెండింటికీ ధీటుగా పిడిఎఫ్ అభ్యర్థులుగా పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలు బరిలోనున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల్లో ముందు నుంచి పిడిఎఫ్ అబ్యర్థులు గట్టి పోటీనే ఇస్తూ వస్తున్నారు. అంతక మునుపు డాక్టర్ గేయానంద్ ఎమ్మెల్సీగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందారు. గత ఎన్నికల్లో గట్టి పోటీనే ఇచ్చినప్పటికీ గేయానంద్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. ఆ ఎన్నికల్లో ఉపాధ్యాయ నియోజకవర్గానికి పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో దిగిన కత్తి నరసింహారెడ్డి విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులుగా పట్టభద్రుల నియోజకవర్గానికి పోతుల నాగరాజు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి కత్తి నరసింహారెడ్డిలు పోటీ చేస్తున్నారు. వారికి ఉద్యోగ,కార్మిక సంఘాలతోపాటు, ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతున్నాయి. అధికార పార్టీ గెలుపుకు అవసరమై అన్ని రకాల ఎత్తులను ఇప్పటి నుంచి మొదలు పెట్టింది. ఆర్జేడీ వ్యవహారమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఏదో రకంగా గెలుపు సాధించేందుకు అవసరమైన అన్ని రకాల ప్రయత్నాలను ఇప్పటి నుంచి మొదలు పెట్టిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

నంబులపూలకుంట : అఖండ భారత సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కొత్త రోడ్డు ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అఖండ భారత సేవా సంస్థ సభ్యుడు సాంబశివ మాట్లాడుతూ ఆంజనేయస్వామి దేవస్థానం కొన్నేళ్ళుగా మరమ్మతులు, పూజకు నోచుకోకపోవడం వల్ల సంస్థ సభ్యులందరూ కలిసి చందాల రూపంలో వసూలు చేసి మరమ్మతులు చేపట్టి ఆలయానికి పూర్వవైభవం తీసుకొచ్చినట్లు తెలిపారు. అంతేగాకుండా పూజలు, భజన, అన్నదానం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, నాగరాజు, అనిల్, వంశీకృష్ణ, యశ్వంత్ శెట్టి, భానుప్రకాష్, వినయ్‌రెడ్డి, శివ, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు 24 మంది ఎంపిక

గోరంట్ల : పట్టణంలోని శ్రీధర్‌రెడ్డి కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 24 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్‌కు అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కోచింగ్ సెంటర్‌లో 40 మంది విద్యార్థులు సైనిక్ స్కూల్ పరీక్ష రాయడానికి శిక్షణ పొందగా 24 మంది అర్హత సాధించినట్లు తెలిపారు.

అక్రమ పునాదుల తొలగింపు

కొత్తచెరువు : మండల కేంద్రంలోని ధర్మవరం రోడ్డులో ఉన్న సర్వేనెంబర్ 384లో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలో ఎలాంటి పట్టాలు లేకుండా అక్రమంగా వేసుకున్న పునాదులను శనివారం తొలగించినట్లు తహశీల్దార్ రామాంజనేయరెడ్డి తెలిపారు. కాలనీలో దాదాపు పది ప్లాట్లు ఆక్రమించుకుని పునాదులను వేసుకున్న విషయం తెలుసుకుని వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది జెసిపి ద్వారా పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వేణుగోపాల్, శ్రీనివాసులు, వీఆర్ఏలు శివప్రసాద్, సాయి, గంగాధర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నాగాబావి ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

చెన్నేకొత్తపల్లి : మండల కేంద్రంలోని పురాతన గ్రామ దేవత నాగాబావి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహాన్ని శనివారం ఘనంగా ప్రతిష్టించారు. పురాతన ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. ఇందులో భాగంగా శనివారం గణపతి హోమం, విగ్రహ ప్రతిష్ట, దిష్టిబొట్టు పెట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి:కదిరి

O.S.No.59/2022

Between:
1.అల్లుగుండు సుదర్శన్‌రెడ్డి 2.అల్లుగుండు క్రిష్ణారెడ్డి 3.పూల లక్ష్మీనరసమ్మ 4.పూల లక్ష్మీదేవి R/o అల్లుగుండు నల్లచెరువు మం॥ ...వాదులు

మరియు

1.ముక్తపురం సీతమ్మ మరియు 7 మంది ...ప్రతివాదులు
2.ముక్తపురం మధుసూదన్‌రెడ్డి S/o ఎం.వెంకటశివారెడ్డి-2వ ప్రతివాది.
3.ముక్తపురం శ్రీనివాసులరెడ్డి S/o ఎం.వెంకటశివారెడ్డి-3వ ప్రతివాది.
4.ముక్తపురం శశికుమార్ S/o ఎం.వెంకటశివారెడ్డి-4వ ప్రతివాది.
5.పి.పద్మావతమ్మ W/o పి.గోవిందరెడ్డి, 6వ ప్రతివాది, R/o మొటుకుపల్లి, కదిరి మం॥ ...ప్రతివాదులు 2,3,4,6

ఇందుమూలముగా ప్రతివాదులు అయిన మీకు తెలియజేయడం ఏమనగా వాదులు అయిన అల్లుగుండు సుదర్శన్‌రెడ్డి మరియు ఇతరులు భాగ పరిష్కార విషయమై మీ అందరిపైన పై కోర్టు నందు దావా వేసియున్నారు. పై దావా వాయిదా 02-03-2023వ తేదీన మీ హాజరు నిమిత్తము అయి వున్నది. ప్రతివాదులు అయిన 2,3,4,6 పై కోర్టు నందు ఉ॥10.30 గం॥లకు హాజరుకావలెను. అట్లు హాజరుకాని యెడల మీ పరోక్షమున కోర్టువారు నిర్ణయము తీసుకొందును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:02-03-2023.

ఎస్.శివశంకర్‌రెడ్డి
వాదులతరపున వకీలు, కదిరి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు:కదిరి

O.S.No.123/2021

Between:
మొపూరి వీరయ్య, తండ్రి రామన్న Residing at D.No.2-67, మాడికవాండ్లపల్లి (విలేజ్), తలుపుల మండలం, శ్రీసత్యసాయిజిల్లా. ...వాది

మరియు

కె.సుబ్బనాయుడు, తండ్రి కె.గంగినాయుడు, Residing కాయలపల్లి (విలేజ్), పెద్దన్నవారిపల్లి పోస్టు, తలుపుల మండలం, శ్రీసత్యసాయిజిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి సమను

ఇందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడం ఏమనగా వాది తన దావాలో కనబరచిన ప్రాంసరి నోటు బాకీ మొత్తమును రాబట్టుకొనుటకు దావా దాఖలు చేసుకున్నాడు. కావున సదరు దావాలో హాజరు నిమిత్తము 03-03-2023వ తేదిన వాయిదా వున్నది. కావున సదరు తేదినాడు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ ఉ॥10.30 గం॥లకు పై తెలిపిన కోర్టులో హాజరు అయి మీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలయును. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:03-03-2023.

కె.చౌడప్ప, బి.యస్సీ, బి.ఎల్., వాదిపరం వకీలు, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా, సెల్:9966350645.

In the Court of the Hon'ble Addl. Junior Civil Judge: Hindupur

I.A.No.28/2022 O.S.72/2022

Between:
K.S. Suresh ...Petitioner/Plaintiff
V/s
Smt. V.Pushpakala ...Respondent/Defendant

Notice to Respondent / Defendant

Smt. V.Pushpakala W/o V.Venktaramana, R/o D.No.26-4-936A, Thyagarajanagar, Hindupur, Sri Sathya Sai Dist.

Whereas the plaintiff has filed the above suit for Specific performance of the sale agreement on the file of the Hon'ble Addl Junior Civil Judge, Hindupur against you the above case is posted on 03-04-2023 for your appearance. Hence you are hereby required to appear before the above said court on 03-04-2023 at 10.30 A.M. either in person or through an advocate. Otherwise, the matter will be decided exparte.

(By the Order of Court)

K.C.KRISHNA REDDY
Advocate
Hindupur, Sri Sathya Sai Dist.

కాంగ్రెస్ కేంద్ర కమిటీలోకి రఘువీరా..?

పార్టీకి జవసత్వాలు నింపేలా చర్యలు

చతీస్‌ఘడ్ రాయపూర్ లో జరిగిన సమావేశంలో పాల్గొన్న రఘువీర్

ప్రజాశక్తి-మడకశిర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ముఖ్య నేతగా గుర్తింపు పొందిన మాజీ మంత్రి, మాజీ పిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డికి కాంగ్రెస్ పార్టీ అత్యున్నత పదవి కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. రాజకీయ అనుభవం ఉన్న రఘువీరారెడ్డికి కేంద్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో అవకాశం కల్పించేలా ఆ పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో చతికలబడ్డ కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపడం కోసం ఈయనకు పార్టీ ముఖ్య పదవి కట్టబెట్టి రాష్ట్రంలో పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కాంగ్రెస్ అధిష్టానం యోచిస్తోంది. నేతల అభిప్రాయాల అనంతరం కాంగ్రెస్ అత్యున్నత వర్కింగ్ కమిటీలో ఆయనకు అవకాశం కల్పించేలా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలను తట్టుకుని కాంగ్రెస్‌ను ఆపార్టీలకు ధీటుగా ఎదుర్కొనేందుకు రఘువీరాను రంగంలో దించుతున్నట్లు తెలుస్తోంది. రఘువీరాకు ముఖ్య పదవి కట్టబెడితే బీసీలు కూడా కాంగ్రెస్ వెన్నంటి ఉంటారని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. పార్టీలో అత్యున్నతమైన సిడబ్ల్యుసిలో రఘువీరాను తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవొచ్చని ముఖ్య నేతలు అనుకుంటున్నారు. రఘువీరా రెడ్డికి ముసాయిదా కమిటీలో సభ్యత్వం ఇవ్వడమే కాకుండా, సిడబ్ల్యుసిలో సైతం అత్యున్నత పదవి ఇచ్చే అవకాశం కన్పిస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే ఈ మేరకు రఘువీరాకు కేంద్ర కాంగ్రెస్ పార్టీ నుంచి సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. ఇటీవల ఈయన కాంగ్రెస్ నిర్వహించిన పలు ముఖ్య సమావేశాల్లో సైతం పాల్గొని, తనదైన శైలిలో పార్టీ అభివృద్ధికి పలు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుతం ఛత్తీస్‌ఘడ్ రాయచూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో సైతం రఘువీరా పాల్గొన్నారు. గత ఎనిమిదేళ్లుగా రాజకీయాల్లో రఘువీరా స్తబ్దుగా ఉంటున్నారు. కాంగ్రెస్‌ను వీడి వేరే పార్టీకి వెళ్తారనే ప్రచారం కూడా పెద్ద ఎత్తున జరిగింది. అయితే వీటన్నంటికి తెరదింపి ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగి భవిష్యత్తులో ఆ పార్టీ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించే అవకాశాలు కన్పిస్తున్నాయి. తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలోనే రఘువీరా ఓ కీలక ప్రకటన చేసే అవకాశం ఉందంటూ ఆయన అనచరులు చెబుతున్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-రొద్దం

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవాలని ఎస్ఐ నాగస్వామి సూచించారు. శనివారం మండలంలోని కొగిర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు అధ్యక్షతన విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగహన పెంచుకోవాలన్నారు. క్రమశిణతో బాగా చదివి, భావి భారత పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా విద్యార్థులు 18 సంవత్సరాలు నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడంతోపాటు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. అలాకాకుండా ఇష్టారాజ్యంగ, అవగాహన లేకుండా నడిపి భవిషత్తు నాశనం అవుతుందన్నారు. అంతేగాకుండా బస్సుల్లో వెళ్లేటప్పుడు మగపిల్లలు ఆకతాయి పనులు చేయకుండా అమ్మాయిల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు ధైర్యంగా తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయినీల వద్ద సమస్యలను చెప్పుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు జాబిలి చాంద్‌బాషా, ఆంజనేయులు, శివయ్య, రామాంజినేయులు, ఆదినారాయణ, నారాయణస్వామి, పీడీ.శ్రీదేవి, రొద్దం పోలీస్‌స్టేషన్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల పరిశీలన

పుట్టపర్తి రూరల్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ బాక్సులు, నిల్వ ఉంచే స్ట్రాంగ్ రూములను రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పుట్టపర్తిలోని చిన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న రిసెప్షన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను పరిశీలించి ఏర్పాట్లపై స్థానిక అధికారులన ఆరాతీశారు. మార్చి 12న పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, 13న సాయంత్రం రిసెప్షన్ చేయనున్నట్లు తెలిపారు. అందుకోసం పాఠశాలలో గదులు, వెలుతురు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాకాల కొండయ్య, తహశీల్దార్ కరణం నవీన్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి, వీఆర్ఓ మనోహర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో మెరిసిన కెఎల్ఎన్ విద్యార్థులు

సైనిక్ స్కూల్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కదిరి టౌన్ : ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో పట్టణానికి చెందిన కెఎల్ఎన్ ఇన్సిట్యూట్ విద్యార్థులు మెరిశారు. శుక్రవారం ఎఐఎస్ఎస్ ఇఎన్‌టిఎ వారు సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్స్టూట్ నిర్వాహకులు రమేష్ మాట్లాడుతూ కెఎల్ఎన్ ఇన్స్టూట్ నుంచి 120 మంది పరీక్షలు రాయిగా 58 మంది విద్యార్థులు ప్రవేశాలకు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిఆపరు. వై.విధాత్రి, లాస్య ప్రియ, మోక్షిత, దీప్తిజ్ఞా, ఐజ, రేహన్, హృతిక్‌రాజు, కార్తిక, లక్ష్మీ, మనీష్, వర్షిత, యధు కీర్తన్, ధనుష్, రోమన్, సాయిమోక్షిత్, మధుప్రియ, అభినవరెడ్డి, సఫాన్‌ఖాన్, యమున, తాహిర్‌బాషా, వరుణ్, హర్షిణీ తదితరులు సత్తా చాటారన్నారు.

బత్తలపల్లి సిఐ మన్సూరుద్దీన్‌కు అభినందన

బత్తలపల్లి : ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో సిల్వర్ మెడల్ సాధించిన బత్తలపల్లి సీఐ మన్సూరుద్దీన్‌ను ఎస్పీ కాగినెల్లి పక్కీరప్ప అభినందించారు. ఈమేరకు శనివారం అనంతపురం జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఫోరెన్సిక్ సైన్స్, ఫోర్సెర్ మెడిసిన్ అంశంపై నిర్వహించిన రాత పరీక్షల్లో సీఐ మన్సూరుద్దీన్ సిల్వర్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

గాండ్లపెంట : మండల పరిధిలోని చామలగొంది పంచాయతీలో రెడ్డివారిపల్లి నుంచి బండమీదపల్లి వరకు రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపిపి తాతం జగన్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి ఆదేశాల మేరకు జిజిఎంపీ నిధులు, ఎంపిపి నిధులతో రోడ్డు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, ఆర్‌బికె ఛైర్మన్ వై.శంకరనాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

న్యాయమూర్తి కె.స్పందన

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతను పెంపొందించుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని న్యాయమూర్తి కె.స్పందన పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటివ్ ఫెయిర్-2023ను జడ్జితోపాటు మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రాథమిక స్థాయి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు రూపొందించిన సుమారు 600 ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు మానవుని మనుగడ, అభివృద్ధి, రాబోవు తరాలకు అనుగుణంగా ప్రకృతిని కాపాడడం కోసమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. న్యాయమూర్తి కె.స్పందన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత వైజ్ఞానిక ప్రదర్శనలో పుస్తక రూపంలో ఉన్న ప్రాజెక్టులే కాకుండా స్వతహాగా సొంత ఆలోచన విధానంతో తయారు చేసే విధంగా ఆసక్తి కలిగించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టు ప్రదర్శనలు ఎంతో అద్భుతంగా ఆకట్టుకున్నాయన్నారు. సేంద్రియ ఉత్పత్తుల ద్వారా పండించిన ధాన్యాలు, తణధాన్యాల వాడకం, ఆరోగ్యం, గ్లోబల్ వార్మింగ్ తదితర వాటితో పాటు వివిధ పండుగల గూరించి వివరిస్తు ప్రాజెక్టులు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రజలు మూఢనమ్మకాలు, మూఢవిశ్వాసాలను పారదోలి శాస్త్ర సాంకేతికతను పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఇలాంటి ప్రదర్శన ద్వారా విద్యార్థులలో విజ్ఞానం, మేధస్సు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి విద్యార్థి ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న గమ్యాన్ని చేరడానికి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ నందకుమార్, అకడమిక్ డైరెక్టర్లు స్మిత, నందిత, హెచ్ఎం గాయిత్రి, ఎఒ భాస్కర్, ఎహెచ్ఎంలు విజయేంద్ర, శశికళ, అబ్దుల్‌రజాక్, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి ప్రయోగాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

జ్యోతి ప్రజ్వలన చేసి ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటివ్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి కె స్పందన

కదిరి పురపాలక సంఘం
"ఇ" ప్రొక్యూర్‌మెంట్

టెండరు నోటీసు నెం.1009 to 1011/KDR/GNRL/2022-23/E1, Dated:25-02-2023
క్రింద తెలిపిన పనులకు అర్హులైన వారి నుండి టెండర్లు పిలువడమైనది.

పని పేరు	పనుల సంఖ్య	అంచనా మొత్తం
General Funds	3 నెం.	రూ.11.81 లక్షలు

ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ ప్రారంభ తేది:27-02-2023 ఉ॥ 11.00 గం॥లకు
ఆన్‌లైన్‌లో షెడ్యూలు డౌన్ లోడింగ్ చివరి తేది:02-03-2023 సా॥ 04.30 గం॥లకు
బిడ్ తెరిచే తేది:02-03-2023 సా॥ 05.00 గం॥లకు

తదుపరి వివరములకు https://tender.apeprocurement.gov.in "ఇ" ప్రొక్యూర్ మెంట్ ప్లేస్‌లో పొందవచ్చును.

ఆఫీసు చిరునామా: కమిషనర్, కదిరి పురపాలక సంఘం, ఫోన్:08494 224091.

Note: Any addendum/Corrigendum/Bid Clarifications/Time extension shall be issued on the website only. No separate press notification shall be issued

సం/- కమిషనర్, కదిరి పురపాలక సంఘం.

వరి పొలాల పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

వరిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

మండలం పరిధిలోని వంకమద్ది గ్రామంలో చెరువు ఆయకట్టు కింద వంద ఎకరాల్లో సాగు చేస్తున్న వరి పంటను మండల వ్యవసాయ అధికారి వి.లోకేశ్వర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ప్రస్తుతం వరి నాటి 20 నుంచి 30 రోజుల అవుతుండటంతో పైరు దుబ్బి కట్టే (గంట కట్టే) దశలో ఉందన్నారు. దీంతో తెల్లదోమ, పచ్చదోమ, తెల్లచీడ, బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు (ఎర్రలాక), అక్కడక్కడా పొటాషియం లోపం ఉన్నట్లు గమనించామన్నారు. దోమ, తెల్లచీడ, ఆకు ముడత పురుగు నివారణకు అసిపేట్ రెండు గ్రాములు, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే రెండు మీటర్ల దూరానికి 20 సెంటీమీటర్ల కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫలితంగా గాలి, వెలుతురు తగిలి దోమ ఉధతి తగ్గుతుందన్నారు. బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, ఎర్ర లాక నివారణకు ప్లాంటోమైసిన్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పొటాషియం లోపం నివారణకు మల్టీ కేను ఐదు నుంచి పది గ్రాములు, లీటర్ నీటి కలిపి 15 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

కారు బైక్ ఢీ..వ్యక్తి మృతి

మృతిచెందిన రాజు

అగళి : మండలంలోని హుల్లేకెర బైపాస్ దగ్గర శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శిర నుంచి మధూడికి వెళ్తున్న కారు అగళి నుంచి శిరకు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం మధుగిరి తాలూకా రంటవళలులు పక్కన ఉన్న కెంచగానహళ్లి గ్రామానికి చెందిన రాజు (37)ను ఢీకొంది. దీంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మదూడి గ్రామానికి చెందిన రామన్న తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాధితుడిని చికిత్స కోసం తుమకూరు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అగళి ఎస్ఐ లావణ్య హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

చెన్నేకొత్తపల్లి : మండలం పరిధిలోని న్యామద్దల గ్రామంలో శనివారం ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడం వల్ల దాదాపు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితురాలు హనుమంతమ్మ తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లి హనుమంతమ్మ కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేది. ఇందులో భాగంగానే ఉదయాన్నే వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇంట్లో ఉన్న కుర్రాడు పక్క ఇంట్లో ఉండగా ఇంటి నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. దీంతో అప్పటికే ఫ్రిడ్జ్, వాటర్ మోటర్, 9 ప్యాకెట్ల బియ్యం, రూ.60వేల నగదు, నాలుగు తులాలు బంగారు, వంట సామగ్రి, మూడు ఫ్యాన్లు, మగ్గం వార్పు, టీవీ పూర్తిగా కాలిపోయాయి. దీంతో సుమారు రూ.4లక్షల వరకూ ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది.

అగ్నికి ఆహుతైన పంటలు

తలుపుల : మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు రామకుమార్ సాగు చేసిన అల్లనేరేడు, సపోటా పంటలు ఆహుతయ్యాయి. రామకుమార్ తనకున్న మూడెకరాల్లో 10 సంవత్సరాల నుంచి అల్ల నేరేడు, సపోటా చెట్లు దాదాపు 230 సాగు చేస్తున్నాడు. ఈనేపథ్యంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో చెట్లు పూర్తిగా కాలిబూడిదయ్యాయని బాధిత రైతు వాపోయాడు. త్వరలో చేతికందాల్సిన పంట అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

యువత క్రీడల్లో రాణించాలి

బుక్కపట్నం : గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో రాణించాలని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఆదర్శ విద్యాసంస్థల అధినేత పెద్దరాసు సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. శనివారం గ్రామస్తుల సహకారాలతో స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత క్రీడల్లో పాల్గొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ యువకుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు కబడ్డీ పోటీలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రెండు రోజులపాటు జరిగే పోటీల్లో దాదాపు 20 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యగారిపల్లి చంద్ర, శివ, శ్యామ్, కుబేర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకను మండలికి పంపుదాం

లేపాక్షి : ప్రశ్నించే గొంతుకను శాసన మండలికి పంపించాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్స్ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డికి మద్దతుగా పలు ప్రజాసంఘాల నాయకుపలు శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పేదల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించి మండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి క్రిష్ణమూర్తి, సిపిఐ మండల కార్యదర్శి శివప్ప, ఎఐఎస్‌యఫ్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలి

ధర్మవరం టౌన్ : త్వరలో జిల్లాలో అడుగు పెట్టనున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిది పురుషోత్తంగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో తెలుగుయువత, టిఎన్ఎస్ఎఫ్, ఐటిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ నాయకత్వంలో మార్చిలో నియోజకవర్గంలోకి అడుగు పెట్టనున్న పాదయాత్రను విజయవంతం చేసి యువత సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధికార ప్రతినిధి చిన్నూరు విజయ్‌చౌదరి, తెలుగుయువత పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్, హిందూపురం పార్లమెంట్ సోషియల్ మీడియా కో ఆర్డినేటర్ తోట వాసుదేవ, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు మందల సురేష్, సిబిఎన్ రామకృష్ణ, నాయకులు చెలిమి శివరాం, నాగేంద్ర, తొగట అనిల్, సంగాల బాలు, బాబా ఫకద్దీన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో పాదయాత్రను ఆపలేరు

పుట్టపర్తి అర్బన్ : అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ పాదయాత్రను ఆపలేరని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్స్ రమేష్ హెచ్చరించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్‌లో విలేకరులతో మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో పాల్గొనడానికి వెళ్తున్న తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు, అధికార ప్రతినిధి రజనీకాంత్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. పాదయాత్రకు వస్తున్న స్పందనను చూసి జగన్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. ప్రజాస్పందనను చూసి ఓర్వలేక ప్రజలను భయభ్రాంతులను చేయడానికి ఎక్కడికక్కడ నిర్బంధించడం చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా.. నియంత పాలనలో ఉన్నామా.. అని అనుమానం కలుగుతోందన్నారు. అరాచక పాలనకు చమరగీతం పాడటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

వందశాతం పౌష్టికాహారం అందించాలి

చిలమత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని వందశాతం అందించాలని ఐసిడిఎస్ సిడిపిఒ రెడ్డి రమణమ్మ సూచించారు. శనివారం స్థానిక కోడూరు సెక్టార్ మినీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ యాప్‌లో అనామిక్ ప్రెగ్నెన్సీ అటెండెన్స్, ప్రీస్కూల్‌పై అవగాహన కల్పించారు. తక్కువ బరువున్న పిల్లలు శ్యామ్ పిల్లల హాజరు ఎలా వేయాలో కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఫైర్ మిషన్లు పంపిణీ

పరిగి : మండల వ్యాప్తంగా 7 జడ్పీహెచ్ఎస్, 9 ప్రైమరీ, 3 అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ప్రభుత్వం మంటలు ఆర్పే మిషన్లను శనివారం పంపిణీ చేశారు. పాఠశాలలో అనుకోకుండా అగ్ని ప్రమాదాలు జరిగితే విద్యార్థుల సంరక్షణ కోసం వీటిని వినియోగించుకోవాలని ఎంఇఒ సూచించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

బుక్కపట్నం : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ నరసింహుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మయ్య సూచించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు లైంగిక వేధింపులు సైబర్ నేరాల నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కాలంలో మహిళలపై జరుగుతున్న అనుచిత చర్యలు అమానుషమన్నారు. ప్రతి పౌరుడు విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే స్త్రీలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టవచ్చన్నారు. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్, ఈ కామర్ సైట్లను ద్వారా కూడా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రమోహన్, రవికుమార్, ఆదినారాయణ, ఓబయ్య, దస్తగిరి, రాజశేఖర్ పాల్గొన్నారు.